కుంట్లూర్ భూదాన్ ప్లాట్ల లబ్ధిదారుల ఆందోళన

● డబ్బులు లేక ఇళ్లను నిర్మించుకోకపోవడంతో కబ్జాకు గురవుతున్నాయని ఆవేదన ● అధికారులు న్యాయం చేయాలని డిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కుంట్లూర్ పరిధిలోని సర్వే నంబర్ 281/1లో భూదాన్ ప్లాట్ల లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తమకు కేటాయించిన ప్లాట్లను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. సోమవారం భూదాన్ ప్లాట్ల లబ్ధిదారులు మహమ్మద్ లాల్‌తో పాటు కొందరు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. 281/1 సర్వే నంబర్‌లో 2013-14 సంవత్సరంలో అప్పటి భూదాన్ యజ్ఞ బోర్డు సుమారు 300 మంది లబ్ధిదారులకు 100 గజాల చొప్పున ప్లాట్లను కేటాయించి పట్టాలను అందజేసినట్లు తెలిపారు. ప్లాట్ల పక్క నుంచే డ్రైనేజీ మురుగు కాల్వ ఉండడం, డబ్బులు లేకపోవడం కారణంగా ఇళ్లను నిర్మించుకోలేదని తెలిపారు. కొద్ది కాలం తర్వాత చిన్న గదులను నిర్మించుకుని విద్యుత్ మీటర్లను కూడా తీసుకున్నట్లు పేర్కొన్నారు. అక్కడ మురుగు వాసన భరించలేక సమీపంలోని రాజీవ్ గృహకల్పలో అద్దెకు ఉంటున్నట్లు చెప్పారు. ఇటీవలే పక్కనే ఉన్న రేణుక వెంచర్ నిర్వాహకులు తమ ప్లాట్లను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. భయభ్రాంతులకు గురి చేస్తూ తమను అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఆయా శాఖల అధికారులు కల్పించుకుని మమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో ప్లాట్ల లబ్ధిదారులు ప్రవీణ్, శ్రీనివాస్, మొయినుద్దీన్, సయ్యద్, యాదయ్య, సురేష్, ఆంజనేయులు, అంజన్, లక్ష్మణ్, అస్సాముద్దీన్ పాల్గొన్నారు.


భూదాన్ ప్లాట్ల వద్ద పట్టాలను చూపిస్తున్న లబ్ధిదారులు

'నకిలీ పత్రాలతో పట్టాభూముల ఆక్రమణ'

భూదాన్ ప్లాట్ల లబ్ధిదారుల ముసుగులో కొందరు ముఠాగా ఏర్పడి పట్టా భూములను ఆక్రమిస్తూ కబ్జాకు పాల్పడుతున్నారని రేణుక హోమ్స్, డెవలపర్స్ డైరెక్టర్ రాంబాబుయాదవ్ తెలిపారు. భూదాన్ భూమి పక్కనే ఉన్న పట్టా సర్వే నంబర్ 278/2లో రేణుక హోమ్స్ పేరుతో గతంలోనే వెంచర్ చేసినట్లు తెలిపారు. అయితే కొందరు భూదాన్ లబ్ధిదారులమంటూ తమ రిజిస్ట్రర్ ప్లాట్లను కబ్జా చేస్తున్నారని తెలిపారు. కొందరు ముఠా సభ్యులు భూదాన్ ప్లాట్ల పేరుతో రిజిస్ట్రేషన్ ప్లాట్లను చూపించి అమాయకులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోమవారం తహసీల్దార్‌తో పాటు పోలీసులు సదరు భూమిని పరిశీలించినట్లు తెలిపారు. 20 రోజుల్లో హద్దులను ఏర్పాటు చేస్తామని తెలిపినట్లు చెప్పారు.


డాంబర్‌తో పూడిన తర్వాత హయత్‌నగర్ టూ కుంట్లూరు రోడ్డు పరిస్థితి

కాల్వను పూడ్చివేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హయత్‌నగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి) : హయత్‌నగర్ నుంచి కుంట్లూరుకు వెళ్లే మార్గంలో కొలన్ శివారెడ్డికాలనీ ఎదురుగా రోడ్డుకు అడ్డంగా ప్రమాదకరంగా మారిన కాల్వను ఎట్టకేలకు జీహెచ్‌ఎంసీ అధికారులు పూడ్చివేశారు. సోమవారం ఉదయమే అధికారులు వచ్చి ప్రమాదకరంగా మారిన కాల్వలో మట్టిని పూర్తిగా తొలగించి అందులో డాంబర్‌తో నింపి ప్రమాదాన్ని అరికట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో గుంతను పూడ్చిన ఆటో డ్రైవర్లు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఇబ్బంది తొలగించారు. మూడు నెలలుగా ఎంతో మంది వాహనదారులు ప్రమాదవశాత్తు కాల్వలో పడి తీవ్ర గాయాలకు గురి అయ్యారు. ఆంధ్రజ్యోతి కథనంతో అధికారులు స్పందించడం పట్ల స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.


ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఫ్లైఓవర్లతో తొలగిపోనున్న ట్రాఫిక్ సమస్యలు

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఫ్లై ఓవర్ల నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు తొలగిపోనున్నాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురంలోని పనామా చౌరస్తాలో నూతనంగా జరుగుతున్న ఫ్లైఓవర్ పనులను సోమవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలకుంటలోని రహదారిపై ఎలక్ట్రానిక్ షోరూం దాటాక 150మీటర్ల అనంతరం ఈ ఫ్లై ఓవర్ ప్రారంభమై సుష్మా జంక్షన్ ఇవతల ముగుస్తుందన్నారు. దాదాపు 850 మీటర్ల మేర ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ ఫ్లైఓవర్ పనులు పూర్తి అయితే ట్రాఫిక్ ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో టీన్స్ షెడ్ పనుల పరిశీలన

చంపాపేట, జూన్ 24(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న టీన్స్‌షెడ్ నిర్మాణ పనులను సోమవారం ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ధర్మకర్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలోని కోనేరు పక్క నుంచి ఆలయంలోకి స్వామి వారి దర్శనం కోసం వేచి ఉండే భక్తుల క్యూలైన్‌పై ఎండ, వర్షాలు కురియకుండా టీన్స్‌షెడ్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో అన్నదాన సత్రం, దేవాలయం ఆవరణలో రఫ్ గ్రానైట్ బండలతో పాటు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, మేక సురేందర్‌రెడ్డి, ముద్ద కళ్యాణ్ చక్రవర్తి, కిరణ్ కుమార్‌గుప్తా, మేకల యాదగిరి, గూడూరు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

శానిటేషన్ సమస్యల పరిష్కారానికి కృషి


శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్, జీహెచ్‌ఎంసీ డీఈ వెంకటేశ్వర్లు

చంపాపేట, జూన్ 24(ఆంధ్ర జ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఆయా కాలనీల్లో నెలకొన్న శానిటేషన్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ సుజాతానాయక్ అన్నారు. డివిజన్‌లోని భూపేష్‌గుప్తానగర్‌కాలనీ, విరాట్‌నగర్‌కాలనీ, వెంకటసాయికాలనీ, డీఆర్‌డీఎల్ కాలనీలలో సోమవారం కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ శానిటేషన్ డీఈ వెంకటేశ్వర్లుతో కలిసి పర్యటించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు కాలనీలకు వచ్చే స్వచ్ఛ ఆటోలలో చెత్తను వేయాలని, బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేయవద్దని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డిఅన్నారం డివిజన్‌ను అభివృద్ధి చేయడమే ధ్యేయం


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలోని మధురాపురికాలనీలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ ఇంజనీర్ రూప, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి: రాగుల


డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్యలను జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి డివిజన్‌లోని పలు కాలనీల్లో డ్రైనేజీలు పొంగి దుర్వాసన వస్తుందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. తక్షణమే స్పందించిన కార్పొరేటర్ సోమవారం జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను పరిశీలించి సంబంధిత సిబ్బందితో సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో జలమండలి ఏజీఎం రాజగోపాల్ పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘన నివాళి


రామోజీరావుకు నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి తదితరులు

సరూర్‌నగర్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు సంస్మరణ సభను సోమవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్ కమ్యూనిటీ హాల్‌లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మీర్‌పేట్ డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి హాజరై కాలనీ ప్రతినిధులతో కలిసి రామోజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం ఉపాధ్యక్షురాలు పాలపర్తి విజయలక్ష్మి, మీర్‌పేట్ కోఆప్షన్ సభ్యుడు పల్లె జంగయ్యగౌడ్, బలరామకృష్ణ, కాలనీ ప్రతినిధులు శ్యామ్‌కుమార్, వెంకటకృష్ణారావు, సంతోష్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగి పాపయ్యరాజు, మ్యూజిక్ అకాడమీ గాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘం ఆసరా..

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): బాటసింగారం రైతుసేవా సహకార సంఘంలో సభ్యురాలు అయిన తారామతిపేట గ్రామానికి చెందిన మద్ది కృష్ణవేణి 15రోజుల క్రితం మృతిచెందింది. దీంతో సంఘం ద్వారా మృతిచెందిన సభ్యురాలి కుటుంబానికి రూ.25 వేలను సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఐలేష్‌యాదవ్, మాజీ డైరెక్టర్ నాగకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్రంగూడ శ్మశానవాటికకు దారి చూపండి

సరూర్‌నగర్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో శ్మశానవాటికకు రోడ్డు సౌకర్యం లేనందున తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ దృష్ట్యా రోడ్డు వసతి కల్పించి ఇబ్బందులు దూరం చేయాలని గుర్రంగూడ 6,7 డివిజన్ల కార్పొరేటర్లు దడిగ శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి సోమవారం అధికారులను, ప్రజా ప్రతినిధులను కోరారు. అదేవిధంగా అల్మాస్‌గూడ-గుర్రంగూడ రోడ్డు విస్తరణ పనులను సైతం పూర్తి చేయించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ శశాంక్, మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి, కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, కమిషనర్ రఘుకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్, లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గుర్రంగూడలో శ్మశానవాటిక కోసం మూడెకరాల స్థలం కేటాయించినప్పటికీ, అందులోకి వెళ్లడానికి దారి మాత్రం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు తీసుకెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, గత్యంతరం లేక 7కిలోమీటర్ల దూరంలోని సాహెబ్‌నగర్ శ్మశానవాటికకు తీసుకెళ్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ దృష్ట్యా ఇక్కడి గుర్రంగూడ-అల్మాస్‌గూడ ప్రధాన రహదారి నుంచి శ్మశానవాటిక వరకు 40అడుగుల దారి ఏర్పాటుకు సర్వే నంబర్.92లోని ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని వారు కోరారు.


ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు శంకర్, లక్ష్మారెడ్డి

అల్మాస్‌గూడ-గుర్రంగూడ రోడ్డును అభివృద్ధి చేయండి

అల్మాస్‌గూడ-గుర్రంగూడ రహదారిలో టెలికాంకాలనీ నుంచి గుర్రంగూడ వరకు గల రోడ్డు అభివృద్ధి కోసం హెచ్‌ఎండీయే నిధులు మంజూరైనప్పటికీ పనులు మాత్రం పూర్తి చేయడంలేదని కార్పొరేటర్లు శంకర్, లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. రెండు కిలోమీటర్ల నిడివి గల ఈ రోడ్డు కోసం రూ.3కోట్లు నిధులు విడుదలై మూడేళ్లు గడిచినా.. కేవలం రోడ్డుకు ఇరుపక్కలా తవ్వి రెడీమిక్స్ వేసి వదిలేశారని వారన్నారు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ దృష్ట్యా ఈ రోడ్డు పనులను వెంటనే ప్రారంభింపజేసి వాహనదారుల ఇబ్బందులు దూరం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా హేమంత కేశవ్ పాటిల్

ఎల్‌బీనగర్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా 2019 బ్యాచ్ ఐఏఎస్ అధికారి హేమంత కేశవ్ పాటిల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐఏఎస్‌ల బదిలీలలో భాగంగా జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్లుగా పలువురిని నియమించింది. ఈ బదిలీలలో భాగంగా ఇప్పటి వరకు హైదరాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పనిచేసిన హేమంత కేశవ్ పాటిల్‌ను ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా నియమించింది. కొమురం భీం ఆసీఫాబాద్, నల్గొండ జిల్లాల అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పనిచేసిన హేమంత కేశవ్ పాటిల్ ఈ సంవత్సరం జనవరిలో హైదరాబాద్‌కు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు జోనల్ కమిషనర్‌గా పనిచేసిన పంకజ సోమవారం సాయంత్రం హేమంత కేశవ్ పాటిల్‌కు బాధ్యతలు అప్పగించారు. అనంతరం పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి హేమంత కేశవ్ పాటిల్‌ను ఉపకమిషనర్లు డాక్టర్ తిప్పర్తి యాదయ్య, సుజాత, జకియా సుల్తానా, సీపీ ప్రసాదరావు, ఎస్ఈ అశోక్‌రెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.



హేమంత కేశవ్ పాటిల్‌కు బాధ్యతలు అప్పగించి అభినందనలు తెలుపుతున్న జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ పంకజ


పతకాలతో కావేటి అరుష్, అవుయుక్త్

అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తాచాటిన సైదాబాద్ చిన్నారులు

సైదాబాద్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): 7వ అంతర్జాతీయ తైక్వాండో ఛాంపియన్ షిప్-2004 పోటీల్లో సైదాబాద్‌కు చెందిన సోదరులు ఇద్దరు అత్యుత్తమ ప్రతిభ కనపరిచి పతకాలు సాధించారు. గోవాలో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు తైక్వాండో కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీలలో కావేటి అరుష్ బంగారు పతకం, కావేటి అవుయుక్త్ కాంస్య పతకాలు సాధించారు. అంతర్జాతీయ కరాటే పోటీలలో పతకాలు సాధించిన చిన్నారులను పలువురు అభినందించారు.

నేడు డయల్ యువర్ డీఎం

చాదర్‌ఘాట్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపో నుంచి నడిచే సిటీ, సబర్బన్ బస్సుల రాకపోకలు, ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు, ఫిర్యాదులను స్వీకరించేందుకు 25వ తేదీ మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ హరి తెలిపారు. 9959226137 ద్వారా సంప్రదించవచ్చని ఆయన వివరించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ లక్ష్మారెడ్డి పాలెంలోని వర్డ్ అండ్ డీడ్ క్యాంపస్‌లో యూనికార్పస్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, రక్త, దంత, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సు రూట్‌లను పరిశీలించిన ఆర్టీసీ డీఎంలు

అబ్దుల్లాపూర్‌మెట్: నగర శివారు బాటసింగారంలో ఆర్టీసీ బస్సులు తిరిగే రూట్‌లను సోమవారం హయత్‌నగర్ ఆర్టీసీ 1-డిపో, 2-డిపో డీఎంలు విజయ్, శ్రీనివాస్‌లు పరిశీలించారు. గత రెండు సంవత్సరాలుగా బాటసింగారం గ్రామంలోకి ఆర్టీసీ బస్సులు రావడం లేదనే విషయాన్ని స్థానిక మాజీ వార్డు సభ్యులు యెర్రవెల్లి మారుతి ప్రసాద్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ఆర్టీసీ డీఎంలకు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ మేరకు ఆర్టీసీ అధికారులు రెండు రోజుల నుంచి బస్సులను గ్రామం మీదుగా నడిపిస్తున్నారు. కాగా సోమవారం డిపో మేనేజర్లు, డిపో సీఐలు బాటసింగారం గ్రామానికి వెళ్లి బస్సులు తిరిగే రూట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.


బాటసింగారం వద్ద బస్సు రూట్‌లను పరిశీలిస్తున్న డిపో మేనేజర్లు

టీజీపీఎస్‌సీ పరీక్షకు 182మంది అభ్యర్థులు హాజరు

కొత్తపేట, జూన్ 24(ఆంధ్రజ్యోతి): కొత్తపేట న్యూ నాగోల్‌లో సీఐఓఎస్ డిజిటల్ ప్రై.లి.లో సోమవారం ఆన్‌లైన్ టీజీపీఎస్‌సీ పరీక్షకు 182 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 185 మంది అభ్యర్థులకు గాను 90 మంది హాజరు కాగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో 185 మందికి గాను 92 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 95 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 93 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి యువకుడి మృతి

సరూర్‌నగర్, జూన్ 24(ఆంధ్రజ్యోతి): ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తూ స్విమ్మింగ్‌పూల్‌లోని లోతైన ప్రాంతంలో మునిగి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని భీమవరంకు చెందిన శ్రీనివాస్‌రావు కుమారుడు సంతప్ కుమార్(26) మీర్‌పేట్‌లోని ఆర్ఎన్‌రెడ్డినగర్ కాలనీలో గల ఓ హాస్టల్‌లో ఉంటూ టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో సాయంత్రం స్నేహితులతో కలిసి బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల ఓ స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొట్టడానికి వెళ్లాడు. ఈత కొట్టే క్రమంలో లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలోకి వెళ్లడంతో నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు, స్విమ్మింగ్‌పూల్ నిర్వాహకులు అతడిని కాపాడడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఊపిరాడక నీటిలోనే తుదిశ్వాస విడిచాడు. సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి జైలు, జరిమానా, బాధితురాలికి నష్టపరిహారం

రంగారెడ్డి కోర్టులు: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి జైలు, జరిమానాతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని అత్యాచారం, పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పుచెప్పారు. స్పెషల్ పీపీ సునీత బర్ల కథనం ప్రకారం గుర్రంగూడకు చెందిన మల్లికార్జున్ అనే వ్యక్తి అదే ప్రాంతానికి చెందిన బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు, ఈ విషయాన్ని బాధితురాలి తల్లి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలతో సహ కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎం.కే. పద్మావతి నిందితుడికి 5సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 10వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

బస్సు ప్రయాణికుల పర్సులు దొంగిలించే ముఠా సభ్యుడి అరెస్టు

కొత్తపేట, జూన్ 24(ఆంధ్రజ్యోతి): బస్సుల్లో ప్రయాణికుల పర్సులు, డబ్బులు, ఇతర విలువైన వస్తువులు, సెల్‌ఫోన్లు దొంగిలించే పాత జేబుదొంగల ముఠా సభ్యుడిని హయత్‌నగర్-1 టీజీఎస్‌ఆర్టీసీ బస్ డ్రైవర్, కండక్టర్ల సాయంతో అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలు డీఎస్ఐ నరేందర్ కథనం ప్రకారం.. ఈనెల 22న హయత్‌నగర్-1 టీజీఎస్‌ఆర్టీసీ బస్ దిల్‌సుఖ్‌నగర్ నుండి చౌటుప్పల్‌కు వెళుతోంది. ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ వద్ద ఏడుగురు ఆ బస్‌లోకి ఎక్కారు. వారు 19వ తేదీన అదే బస్సులో ప్రయాణించి తుప్రాన్‌పేట వద్ద బస్సు దిగిన ఓ వృద్ధ ప్రయాణికుడి వద్ద రూ.50వేలు లాక్కుని పరారైన జేబుదొంగలేనని డ్రైవర్ చక్రపాణి, కండక్టర్ జయశ్రీ గుర్తుపట్టారు. డ్రైవర్ చక్రపాణి బస్సు నిలిపి వారిని వీడియో తీస్తూ 19వ తేదీన ముసలాయన దగ్గర డబ్బులు కొట్టేసింది మీరే కదా అన్నాడు. అంతే వెంటనే వారందరూ బస్సు దిగి పరారవుతుండగా వారిలో ఒకడిని పట్టుకుని తొలుత హయత్‌నగర్ పీఎస్‌లో అప్పగించారు. అక్కడి నుండి అతడిని ఎల్బీనగర్ పీఎస్‌కు తరలించారు. ఎల్బీనగర్ డిటెక్టివ్ పోలీసులు అతడిని అరెస్టు చేసి విచారించారు. అతడు భువనగిరి టౌన్‌కు చెందిన కొమ్ము ప్రశాంత్(24) అనీ, పాత జేబు దొంగల ముఠాలో ఒకడని గుర్తించారు. అతడిపై ఉస్మానియా పీఎస్‌లో 5, ఎల్బీనగర్‌లో 2, ఉప్పల్‌లో 1, యాదగిరిగుట్ట పీఎస్‌లో ఒక కేసు ఉన్నాయని విచారణలో తేలింది.


కొమ్ము ప్రశాంత్


లక్ష్మీహయగ్రీవ హోమంలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా లక్ష్మీహయగ్రీవ హోమం

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): దండరామ్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, అన్ని వృత్తుల వారు తమ, తమ రంగాలలో అభివృద్ధి సాధించాలని ప్రత్యేకంగా లక్ష్మీహయగ్రీవ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బిచినేపల్లి లక్ష్మీనర్సింహారావు, కార్యదర్శి గంధం వెంకటేశ్వర్లు, కోశాధికారి నర్సింహారావు, బిచినేపల్లి వెంకటేశ్వరరావు, పాల్తి శ్రీనివాస్, నారాయణమూర్తి, లక్ష్మణరావు, రామకృష్ణయ్య, జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): లలితానగర్‌లోని గడ్డి అన్నవర క్షేత్ర వీర వెంకట సత్యనారాయణస్వామి ఆలయంలో సోమవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. గరుడ హోమం, అన్నదాన కార్యక్రమంలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వూర నర్సింహ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ పాల్తి శ్రీనివాస్, మాజీ చైర్మన్‌లు వీరేశం, వక్కలంక శ్రీనివాస్‌రావు, చిదర నాగేందర్, బచ్చు సత్యనారాయణ, కుమారస్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.


ధ్వజారోహణ కార్యక్రమం

రేపు ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్

సరూర్‌నగర్/చాదర్‌ఘాట్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పన డిమాండ్‌తో పాటు ప్రైవేటు పాఠశాలల విద్యా వ్యాపారానికి వ్యతిరేకంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్యారీ మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ముగిసిన భూపాల్‌రెడ్డి అంత్యక్రియలు

వనస్థలిపురం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు జనగాం భూపాల్‌రెడ్డి అంత్యక్రియలు సోమవారం సాయంత్రం నాగోల్ శ్మశానవాటికలో నిర్వహించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో భూపాల్‌రెడ్డి చేసిన పోరాటం మరువలేనిదని పలువురు ఉద్యమకారులు గుర్తుచేసుకున్నారు. తన వృత్తి చేసుకుంటునే మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన భూపాల్‌రెడ్డి లేని లోటు తీర్చలేనిదన్నారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయన భౌతికాయానికి నివాళ్లు అర్పించారు. నివాళులర్పించిన వారిలో తెలంగాణ జేఏసీ నాయకులు కెవి రంగారెడ్డి, గోదాల వెంకట్‌రెడ్డి, పరమేష్‌యాదవ్, సింగారపు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరెడ్డి, సీనయ్య, తదితరులున్నారు.

రాజస్థానీ బాధిత కుటుంబాలకు భోజనం అందజేత

హయత్‌నగర్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో గుడారం కోల్పోయిన రాజస్థానీ బాధిత కుటుంబాలకు సోమవారం హయత్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు భోజనం అందజేశారు. రెండు రోజుల క్రితం బాధితులను పరామర్శించడానికి వచ్చిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బాధితులకు భోజన వసతి కల్పించాలని స్థానిక నాయకులను ఆదేశించడంతో సోమవారం వారు బాధితులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


నిరసన, ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట్‌బంజార, గణేశ్‌నాయక్

లంబాడీలకు మంత్రి పదవి కోసం

28న సీఎం ఇంటి ఎదుట ధర్నా

పంజాగుట్ట, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ఎదట ధర్నా చేయనున్నట్లు గిరిజన విద్యార్థి సంఘం, లంబాడీ హక్కుల పోరాట సమితి, బంజారా గిరిజన విద్యార్థి సమైక్య సంఘాల రాష్ట్ర అధ్యక్షులు వెంకట్‌బంజార, గణేశ్ నాయక్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయా సంఘాల నాయకులు పాండునాయక్, శ్రీనివాస్, సరోజబాయితో కలిసి వారు ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీవో 33 ప్రకారం గిరిజనులకు ఇచ్చిన పది శాతం రిజర్వేషన్ కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం వాటిని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, ఫిబ్రవరి 15న సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వ సెలవుగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాస్‌నాయక్, పార్వతి, యాదమ్మ, లక్ష్మణ్ నాయక్, బన్సీలాల్‌నాయక్, సుధీర్‌నాయక్, మురళినాయక్ పాల్గొన్నారు.

కోకాపేటలో రూ.498 కోట్లతో జీఐఎస్ సబ్‌స్టేషన్

హైదరాబాద్ సిటీ, జూన్ 24(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విస్తరణ.. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కోకాపేటలో 220/132/33 కేవీ గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్(జీఐఎస్) నిర్మాణానికి ట్రాన్స్‌కో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.498 కోట్లతో సవరించిన అంచనాలకు పరిపాలన అనుమతిలిస్తూ ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీ సోమవారం ఉత్తర్వు జారీ చేశారు. 2023 ఏప్రిల్ 6న రూ. 519.77 కోట్ల అంచనా వ్యయంతో గతంలో ఉత్తర్వులు ఇవ్వగా, దాన్ని తాజాగా సవరించారు. అంచనా వ్యయం సుమారు రూ. 20 కోట్లు తగ్గించారు. కోకాపేట ఉపకేంద్రం నిర్మాణానికి రూ. 171.85 కోట్లు, కేతిరెడ్డిపల్లి- శంకర్‌పల్లి 220కేవీ నుంచి కోకాపేట వరకు 14 కిలోమీటర్ల దూరం ఓవర్‌హెడ్ విద్యుత్ లైన్లను మోనోపోల్స్‌తో నిర్మించేందుకు రూ. 136.03 కోట్లు అవుతుందని అంచనా వేశారు. గచ్చిబౌలి- రాయదుర్గం 220 కేవీ నుంచి 10.5 కిలోమీటర్లు కోకాపేట వరకు మోనోపోల్స్‌తో ఓవర్ హెడ్‌లైన్లు వేసేందుకు రూ. 109.55 కోట్లు అవుతుందని అంచనాలు రూపొందించారు.